www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 27 సెప్టెంబర్ 2024

5

చిత్తూరు

పాడి రైతుకు క్రెడిట్ కార్డులు

- తక్కువ వడ్డీకి రుణాలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

పాడి రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చేలా ప్రభుత్వం క్రెడిట్ కార్డులు జారీ చేయనుంది. ప్రతి కార్డుదారుడు దాణా, విత్తనాలు కొనుగోలు చేసుకొనే వెసులు బాటు కల్పించనుంది. చిత్తూరు జిల్లాలో పాల దిగుబడిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ప్రభుత్వం పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు అమల్లోకి తీసుకొచ్చింది. పశులు మేత కొనుగోలు సమయంలో డబ్బులు లేకుంటే అప్పు చేయాల్సి ఉంటుంది. ఇందుకు ఎక్కువ వడ్డీకి రుణాలు తీసుకొని అప్పుల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో పాడి రైతులు బ్యాంకుల నుంచి సులువుగా రుణాలు పొందెలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీకేసీసీ పథకానికి శ్రీకారం చుట్టాయి. గడ్డి, విత్తనాలు, దాణా, వైద్య అవసారాలకు ఈ రుణాన్ని వినియోగించుకొనే వెసులుబాటు కల్పించాయి.

వ్యవసాయం పశుపోషణపై ఆధారపడిన రైతులు, కౌలు రౌతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పశు కిసాన్ క్రెడిట్ కార్డులు పొందవచ్చు. మూడేళ్ళ తరువాత పునర్ధరించుకోవాలి. చిత్తూరు జిల్లాలో 18 వేల కిసాన్ క్రెడిట్ కార్డులు మంజురు చేయాలని పశుసంవర్ధశాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం దాదాపు 4,500 మందికి పైగా కిసాన్ క్రెడిట్ కార్డులు పొందిన్నట్లు పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు.

దరఖాస్తు ఇలా..

గ్రామ పశుసంవర్ధక సహాయకులు, పశు వైద్య సిబ్బంది సహకారంతో దరఖాస్తులను పూర్తి చేసి సమీపంలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన బ్యాంకుల్లో అందజేయడం ద్వారా అర్హత కలిగిన పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు, పాస్ పుస్తకం ఇస్తారు. కేవైసి కోసం భూమి దస్త్రాలు, పశువు ఆరోగ్య ధృవపత్రం, పాస్‌పోర్టు సైజు ఫోటోలు, అధార్, పాన్, ఓటరు గుర్తింపు కార్డుల జిరాక్స్ కాపీలు పొందుపరచాలి. నెలకు రూ.12లు చెల్లిసే పాడి రైతుకు అయిదేళ్ళ వరకు ప్రధాన మంత్రి స్వయంవృద్ధి భీమా యోజన వర్తిస్తుంది. మరణిస్తే, శాశ్వత అంగవైకల్యం కలిగితే భీమా సొమ్ము రూ.2 లక్షలు పొందవచ్చు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా గరిష్ఠంగా ఇచ్చే రుణం రూ.3లక్షలు, పూచీకత్తు లేకుండా మంజూరు చేసే మొత్తం రూ.1,60 లక్షలు, 40 రోజుల లోపు తిరిగి చెల్లిస్తే వడ్డీ ఉండదు. గడువు దాటాకా చెల్లిస్తే 7శాతం వడ్డీ వసూలు చేస్తారు. ఏడాదిలోగా క్రమం తప్పకుడా తిరిగి చెలిస్తే ఆర్‌బిఐ, నాబార్డు 3శాతం, బ్యాంకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీ 3శాతం వడ్డీ మినహాయింపు ఇస్తాయి. రైతు చెల్లించాల్సింది ఒక శాతం మాత్రమే.

కిసాన్ క్రెడిట్‌తో బహుల ప్రయోజనాలు

పాడి రైతుల కోసం ప్రభుత్వం అందిస్తున్న కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా బహుళ ప్రయోజనాల పొందవచ్చు. అవసరానికి రుణం తీసుకొవచ్చు. సకాలంలో చెల్లిస్తే వడ్డీపై రాయితీ ఉంటుంది. పశుల కొనుగోలు, వాటి పోషణ కోసం ఉపయోగించుకోవడం వల్ల పాడిరైతుకు ప్రయోజనం. పాడిరైతులను ఆదుకొనేలా పాడిఆవుల కొనుగోలు చేసేందుకు అప్పులు చేయరాదనే ఉద్దేశంతో కిసాన్‌క్రెడిట్ కార్డులు జారీ చేయడం జరుగుతోంది. జిల్లాలోని పశుపోషణ చేపడుతున్న రైతులు, కౌలు రైతులు, పాడి ఆవులను కలిగిన స్వయం సహాయ సంఘ సభ్యులు కిసాన్ క్రెడిట్ కార్డులు పొందేందుకు అర్హులు. ఈ అవకాన్ని సద్వినియోగం చేసుకోవడం వల్ల బహుల ప్రయోజనాలు పొందవచ్చు.

- డాక్టర్ ప్రభాకర్‌రావు,
పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్

మొగిలిలో మళ్లీ..

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ
- డీజిల్ ట్యాంకు పేలి లారీకి మంటలు
- ఇద్దరు మృతి, ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం ఉదయం మండలంలోని మొగిలి ఘాట్లో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వి కోట నుండి భద్రాద్రికి కట్టెల లోడుతో బయలుదేరిన లారీ మొగిలి ఘాట్లో మరమ్మతులకు గురైంది. దీంతో డ్రైవర్, క్లీనర్ అల్లూరి జిల్లా చింతలగూడ చెందిన జమ్మిచెట్టి రామరాజు, తూర్పుగోదావరి జిల్లా కన్నా గూడెం చెందిన నాగయ్యలు వాహన పక్కన నిద్రపోయారు. బెంగళూరు నుంచి మొగిలి శ్రీని ఫుడ్స్‌కు చక్కర తెస్తున్న లారీ ఆగి ఉన్న లారీని ఢీకొన్నది. దీంతో డీజిల్ ట్యాంక్ పగిలి నిప్పురవ్వలతో లారీకి నిప్పు అంటుకుంది. సంఘటనలో మంటలు అంటుకోవడంతో లారీ డ్రైవర్ జమ్మిచెట్టి రామరాజు, చక్కెర లోడ్‌తో వస్తున్న బెంగళూరు లారీ క్లీనర్ యాదగిరి సంఘటన స్థలంలోనే మృతిచెందారు. నాగయ్యకు, డ్రైవర్ సాయికి గాయాలు కాగా 108 ద్వారా బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రధమ చికిత్స చేపట్టి మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరణించిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మంటల్లో కాలుతున్న కట్టెల లోడ్ లారీ

పూర్తిగా కాలిపోయిన రామరాజు మృతదేహం

మృతుడు క్లీనర్ యాదగిరి

వరసిద్ధునికి పట్టువస్త్రాలు సమర్పణ

స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ప్రధాన అర్చకులు దుర్గా ప్రసాద్

ప్రజాశక్తి- ఐరాల: స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీకనకదుర్గ అమ్మవారి దేవస్థానం నుంచి దేవస్థానం ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్, ఏఈవో బి.వెంకట్ రెడ్డి పట్టువస్త్రాలను స్వామివారికి సమర్పించారు. వీరికి కాణిపాకం దేవస్థానం ఈవో గురుప్రసాద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామిఆరి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందించారు. అనంతరం కనకదుర్గా అమ్మవారి దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఈవోకి అందజేసి దసరా ఉత్సవాలకు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఈవోలు ఎస్‌వి.కృష్ణారెడ్డి, హరి మాధవరెడ్డి, సూరింటెండెంట్లు వాసు, కోదండపాణి పాల్గొన్నారు.

ఏచూరికి ఘన నివాళి

సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి- పలమనేరు: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి సంస్మరణ సభ గురువారం పలమనేరు ఆర్‌విఆర్ హాల్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో సీతారాం ఏచూరికి సిపిఎం, సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు, జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, బిఎస్‌ఎన్ఎల్ సీనియర్ సుకుమార్, సిపిఐ నాయకులు చెన్నకేశవులు, యుటిఎఫ్ నాయకులు రమణ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఐదు దశాబ్దాల పాటు ఎర్రబాటలో అగ్రగామిగా నిలిచారని, విద్యార్థి దశలోనే కేంద్ర ఎస్‌ఎఫ్‌ఐ కమిటీలో సభ్యులుగా కొనసాగి సిపిఎం జాతీయ అధ్యక్షులుగా పార్టీని నడిపించారని అన్నారు. ఆయన మరణం సిపిఎంకు తీరని లోటు అని అన్నారు. దేశంలో మతోన్మాద శక్తులు బలపడుతున్న సందర్భంగా వాటికి వ్యతిరేకంగా వామపక్షాలను ప్రతిపక్ష పార్టీలను ఐక్యం చేసి పోరాటం చేసి వాటిని నిలువరించడంలో కీలకపాత్ర పోషించారని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యక్ష పోరాటాల్లోను రాజ్యసభ సభ్యులుగా పార్లమెంట్లను గళంవిప్పిన గొప్ప నాయకుడుని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఓబుల్ రాజు, కె.సురేంద్రన్, గిరిధర్ గుప్తా, భువనేశ్వరి, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి బంగారు మురళి, జిల్లా కార్యదర్శి ఈశ్వర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వినోద్, సిపిఐ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పరిసరాల పరిశుభ్రతలో ప్రపంచంతో పోటీ పడదామని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు పిలుపునిచ్చారు. చిత్తూరులోని మున్సిపల్ పార్కుకు సమీపంలోని రిలయన్స్ మార్ట్, గ్రీమ్స్ పేటలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, నెహ్రూ యువ కేంద్ర సంఘతన్ చిత్తూరు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 2024 స్వచ్ఛతా హి సేవా, మేరా యువ భారత్ కార్యక్రమానికి చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్‌తో కలిసి ఎంపీ పాల్గొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేకు కార్యక్రమ నిర్వాహకులు ప్రదీప్ ఘనస్వాగతం పలికారు. అనంతరం చిత్తూరు పౌరులతో ప్రతిజ్ఞ చేయించారు. నగర కార్పొరేషన్ మేయర్ అముద, టిడిపి సీనియర్ నేత గిర్వాణి చంద్ర ప్రకాష్, కార్పొరేటర్ అశోక్, జగదీష్ నాయుడు, మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, నెహ్రూ యువ కేంద్ర సంఘతన్ చిత్తూరు సభ్యులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపి, ఎమ్మెల్యే

ఊరగుట్టను సమగ్ర సర్వే చేయాలి

- అక్రమంగా ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలి
- యానాదులకు శాశ్వత ఇళ్లు కట్టివ్వాలి
- సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఊరగుట్టను సమగ్ర సర్వే చేపట్టాలని సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని మొగిలి గ్రామంలో సర్వేనంబర్ 61లో ఊరగుట్టలో ఉన్న 59 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊరగుట్టను సర్వే చేసి ఆక్రమణకు గురైన భూమిని కాపాడాలన్నారు. పది రోజుల క్రితం ఈ భూమిపై కలెక్టర్‌కు సిపిఎంకి ఫిర్యాదు చేయగా డిప్యూటీ కలెక్టర్‌ను కేటాయించి క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే చేసి భూమి వివరాలను రిపోర్టు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించగా మండల సర్వేయర్ చేయాలని స్థానికంగా ఉన్న రెవెన్యూ అధికారులు రకరకాల పద్ధతుల్లో ఆక్రమదారులకు ఒత్తాసు పలికే విధంగా వ్యవహరిస్తున్నారని అర్థమవుతోంది. జిల్లా అధికారులు సమగ్రంగా సర్వేచేసి ఆ భూమిని కాపాడాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా సంవత్సరాల కొద్ది అనుభవంలో ఉన్న యానాదులకు స్మశానం కోసం 5ఎకరాల కేటాయించాలని, ఇతర భూమిని వారు గొర్రెలు, మేకలు, పశువుల మేపుకోవడానికి ఇతర సౌకర్యాలకు ఆ భూమిని కేటాయించాలని అన్నారు. 50 కుటుంబాలు శాశ్వత ఇండ్లు లేక ఎండోమెంట్ భూముల్లో ఉన్నారని ఊరగుట్ట ప్రాంతంలో వీరికి శాశ్వత ఇండ్లు ప్రభుత్వం కేటాయించి కట్టించాలని కోరారు. స్థానిక రెవెన్యూ అధికారులు రకరకాల పద్ధతుల్లో యానాదులను మభ్యపెట్ట పనిచేస్తున్నారని, వాటిని పక్కనపెట్టి ఉన్న సమాచారాన్ని జిల్లా అధికారులకు ఇవ్వాలన్నారు. స్థానిక సర్వే అధికారులు చేసిన సర్వేపై అపనమ్మకం కలిగించే విధంగా చేశారని జిల్లా సర్వే ద్వారా సర్వే చేయాలన్నారు. ఇదివరకే అగ్రవర్ణాలకు ఇచ్చిన పట్టాలను రద్దుచేసి యానాదులకు పట్టాలు ఇవ్వాలని లేనిపక్షంలో దీనిపై పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, మురళి, ఓబుల్ రాజు, వినోద్, గోపి, మంజునాథ్, యానాది సంఘం నాయకురాలు సావిత్రమ్మ, యానాదులు పాల్గొన్నారు.

ఊరగుట్టలోని భూములను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

నీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

- డయల్ యువర్ ఎమ్మెల్యేలో గురజాల

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పనిచేస్తున్నామని, నియోజకవర్గం పరిధిలో ప్రజాసమస్యలను దశలవారీగా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట మధ్య 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఫోన్ ద్వారా సమస్యలను తెలుపగా ఎమ్మెల్యే వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈకార్యక్రమంలో మొత్తం 42 మంది ఫోన్ కాల్స్ ద్వారా తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో ఎక్కువగా నీటి సమస్య, డ్రైనేజీ సమస్యలు, గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాల పరిధిలో రోడ్లు, రెవెన్యూ, పోలీసు, ట్రాన్స్‌కో శాఖలకు సంబంధించి సమస్యలు వచ్చినట్లు తెలిపారు. అలాగే నీటి సమస్యల ఎక్కువగా ఉన్నందున సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమస్య ఎక్కువగా ఉన్నచోట కొత్త బోర్లు తవ్వాలని, బోర్లు ఎండిపోయిన ప్రాంతాల్లో తక్షణం అదనపు టాంకర్లను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అలాగే ఇకపై నెలలో ఒకరోజు డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సమయాన్ని గంట నుంచి మూడు గంటలకు పెంచుతామన్నారు. కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, తహశీల్దార్ కళావతి, అధికారులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్

సూక్ష్మ పరిశ్రమలు పెరగాలి : ఎంపి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి దగ్గు మళ్ళ ప్రసాదరావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నిరుద్యోగ సమస్య తీరాలంటే సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమల స్థాపన జరగాలని చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు పేర్కొన్నారు. గురువారం జిల్లా సచివాలయంలోని డిఆర్‌డిఏ సమావేశ మందిరంలో పిఎంఈజిపి పథకంకు సంబంధించి జిల్లాస్థాయి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపితో పాటు ఖాదీ, గ్రామీణ పరిశ్రమల రాష్ట్ర కమిషన్ (కెజిఐసిక్ష్మి డైరెక్టర్ డాక్టర్ ఎస్.గ్రీప్, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డిఆర్‌డిఏ పిడి తులసి, ఎల్‌డిఎం హరీష్ పాల్గొన్నారు. ఎంపి మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య తీరాలంటే సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమల స్థాపన జరగాలన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి కల్పించడంతోపాటు రాష్ట్ర ఆదాయం పెరుగుతుందని, కేంద్ర ప్రభుత్వం పిఎంఈజిపి కింద విరివిగా రుణాలు, సబ్సిడీ మంజూరు చేస్తున్నదని అన్నారు. చదువుకున్న యువత ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని మరికొందరికి ఉపాధి కల్పించడంతోపాటు జిల్లాలో నిరుద్యోగ సమస్యను తగ్గించవచ్చు అన్నారు. ఔత్సాహికులు వారి ప్రాజెక్టులు సిద్ధంగా ఉంటే త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని ఎల్‌డిఎంకు సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో టమోటా ప్రాసెసింగ్ యూనిట లు, మామిడి గుజ్జు పరిశ్రమ ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. పట్టుగూళ్ల పెంపకం, పాల డెయిరీ, పౌల్ట్రీ, హోటల్‌ల ఏర్పాటుకు సంబంధించి స్కీములు ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో మండల, నియోజకవర్గ పరిధిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డిఎం ఔత్సాహికులు పాల్గొన్నారు.

మండల సర్వేయర్‌గా చంద్రశేఖర్

ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు మండల సర్వేయర్‌గా గురువారం జిసి చంద్రశేఖర్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఐరాల మండలంలో పనిచేస్తున్న ఈయన బదిలీపై పూతలపట్టుకు విచ్చేశారు.

సర్వేయర్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

తహశీల్దారును కలిసిన ఆయన పై అధికారి సహకారంతో దీర్ఘకాలికంగా ఉన్న భూసమస్యలపై దృష్టి సారించినట్లు తెలిపారు.

దళితవాడలో పడకేసిన పారిశుద్ధ్యం

- పాచిపట్టిన ఇంటి పరిసరాలు
- పూడిపోయిన కాలువలు
- పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి
- జ్వరాలతో, రోగాలతో బాధపడుతున్న గ్రామస్తులు

మురుగు, వర్షపు నీరు నీల్వ చేరిన రోడ్డు, పాచిపట్టిన నీటి ట్యాంకు

ప్రజాశక్తి- విజయపురం (నింద్ర): నింద్ర మండలం నెట్టేరిలో దళితవాడలో పారిశుద్ధ్యం పడేసింది. ఈ గ్రామంలో సుమారు 100కు పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నారు. సుమారు నాలుగు వీధులు ఉన్నాయి. ఏ వీధికి వెళ్లిన రోడ్డుపై మురుగు నీరు నిలిచి ఉంది. ఇంటి పరిసరాలలో వర్షపు నీరు నిలిచి పాచిపట్టి ఉంది. ఉన్న ఒకటి, రెండు మురుగు కాలువలు పూడి పోయాయి. అసలు అక్కడ పరిస్థితి చూస్తుంటే అధికారులు ఇంత వరకు ఆ ఊరు వైపు కన్ను వెత్తిచూచినట్లు కనిపించలేదు. అంతే కాకుండా కాలువలో పూడికతీత పనులు ఇంత వరకు చేపట్టలేదంతే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థమవుతుంది.

పూడిపోయిన కాలువ

ఇంటి పరిసరాలో పాచిపట్టిన నీరు

ఇటీవల కురిసిన వర్షానికి ఇంటి పరిసరాలలో వర్ష నీరు నిలిచి పాచిపట్టి ఉంది. వర్షపు నీరు వెళ్లడానికి మార్గం లేకపోవడం, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇలాంటి దుస్థితి ఏర్పాడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై మురుగు నీరు నిలిచిపోవడంతో ఇంటి నుంచి బయటకు రావడానికి ఇబ్బందిపడుతున్నారు. అంతే కాకుండా పాచిపట్టిన నీటి నుంచి దుర్వాసన వస్తోందని, దోమలు పెరిగి రోగాల భారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అధికారులు అసలు మా గ్రామానికి రావటం మరిచిపోయారని, అధికారులు ఉన్నారా..లేదా అని కూడా తెలీడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంటిపై కనుకు లేదు

నన్నేం చేయమంటారు..?

- సతీష్, పంచాయతీ కార్యదర్శి, నెట్టేరి.

దళితవాడ మిట్ట ప్రాంతలో ఉంది. వర్షపు నీరు బయటవెళ్లడానికి ఎలాంటి మార్గం లేదు. అందుకే వర్షపు నీరు నిలిచిపోయింది. నన్ను ఏమి చేయమంటారు..

ఇంటి పరిసరాలలో వర్షపు నీరు నిలిచి దోమలకు నిలయంగా మారింది. రాత్రి పూట దోమ కాటు గ్రామంలో ప్రజలు జ్వరంతో బాధపడుతున్నారు. నిత్యం ఆసుపత్రికి చుట్టు తిరుగుతున్నామన్నామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటి వరకు గ్రామంలో పారిశుద్ధ్యం పనులు చేసి పాపానపోలేదన్నారు. అసలు పారిశుద్ధ్యం అంటే ఏమిటో అని గ్రామస్తులు ఆశ్చర్యపోతున్నారు. ఇంత వరకు కనీసం రూ.10ల బ్లీచింగ్ పౌడర్ చల్లిన పాపనపోలేదన్నారు.

పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి

గ్రామ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సిన పంచాయతీ కార్యదర్శి ఇంత వరకు దళితవాడ వైపు కన్నెత్తి చూడలేదన్నారు. దళితవాడ ప్రజలను పట్టించుకోవడంలేదని, కనీసం ఫోన్‌చేసి చెప్పినా స్పందించడం లేదని ఆవేదన చెందారు. ప్రస్తుతం గ్రామంలో జ్వరంతో చాలా మంది బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నేటి నుంచి
తిరుమల ప్రక్షాళన పాదయాత్ర

ప్రజాశక్తి- పుంగనూరు: తిరుమల క్షేత్ర పవిత్రత రక్షణ.. కోట్లాది భక్త జన మనోభావాల పరిరక్షణ.. లక్ష్యంగా ఈనెల 27వ తేదీ శుక్రవారం పుంగనూరు నుండి తిరుమల వరకు కాలి నడకన తిరుమల పరిరక్షణ పాదయాత్ర ప్రారంభం అవుతుందని బిసివై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ తెలిపారు. గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుంగనూరులోని హనుమతరాయ దిన్నె వీరాంజనేయ స్వామి ఆలయం వద్దనుండి శుక్రవారం ఈ కార్యక్రమం ఆరంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీశ్రీశ్రీ రామానుజాచార్య వంశ పరంపర, శ్రీ యదుగిరి యతిరాజ్ మఠాధిపతి శ్రీశ్రీశ్రీ నారాయణ రామానుజ జీయర్ స్వామి వారు, శ్రీమహంత్ కళ్యాణ్ దాస్‌జీ మహరాజ్ విచ్చేయనున్నారని పేర్కొన్నారు. అలాగే శ్రీపీఠం వ్యవస్థాపకులు శ్రీ పరిపూర్ణానంద స్వామీజీ, త్రిశక్తి మంత్రాశ్రమ సిద్ధయోగులు, శాక్తేయా సాంప్రదాయ సదాచార సంపన్నులు శ్రీశ్రీశ్రీ ఆడిదండి శక్తిశ్రీ భగవతీ మహారాజ్ స్వామి, శ్రీ క్రిష్ణ యాదవానంద స్వామీజీ కూడా విచ్చేయనున్నారని తెలిపారు. ఈ ప్రముఖులతో సహా కంచి పీఠం నుండి గురువులు, స్వామీజీలు, ఇతర ప్రాంతాల నుండి ప్రముఖ స్వామీజీలు రానున్నారని ఈ పాదయాత్రను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

బంగాళా దుంప సాగుపై అవగాహన

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి- వికోట: మండల కేంద్రమైన వి కోటలోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో బంగాళాదుంప సాగు రైతులకు మెళకువలు, అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు జిల్లా ఉద్యాన అధికారి డాక్టర్ మధుసూదన రెడ్డి, కోలార్ కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ మంజునాథరెడ్డి, డాక్టర్ ఆషా రైతులకు బంగాళాదుంప సాగు మెలకువలను వివరించారు. బంగాళాదుంప సాగు చేయదలచిన రైతులు నాణ్యమైన, ధృవీకరించబడిన విత్తన దుంపలను ఎంచుకుని సాగు చేయాలని సూచించారు. అనంతరం క్షేత్రస్థాయిలో బంగాళాదుంప సాగును పరిశీలించారు. కార్యక్రమంలో పిడి ఏపీఎంఐపి బాలసుబ్రమణ్యం, స్థానిక ఉద్యాన అధికారి లక్ష్మీ ప్రసూన, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'విద్య, వైద్యంతోనే స్వర్ణాంధ్ర'

ప్రజాశక్తి- విజయపురం (నగరి)

స్వర్ణాంధ్ర -2047 లక్ష్యంగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే నీటి వనరుల అనుసంధానం, ఆధ్యాత్మిక ప్రదేశాల అనుసంధానం, గ్రామాల అనుసంధానం ద్వారా అభివృద్ధి సాధించవచ్చునని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ తెలియజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్యం, వైద్య సేవలను అందించడానికి మరింత కృషి జరగాలని సూచించారు. ఆధ్యాత్మిక ప్రాంతాలకు అనుగుణంగా వినోదం అందించే పార్కులను అభివృద్ధి చేయాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్ రాజు మాట్లాడుతూ సాధారణ విద్యతో పాటు తప్పనిసరిగా వృత్తి, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించాలన్నారు. తద్వారా నవకల్పనలు, నూతన ఆవిష్కరణలు సాధ్య పడతాయని తెలిపారు. చిత్తూరు అభివృద్ధికి వ్యవసాయానికి అందించినట్లు పవర్ లూమ్ ఇండస్ట్రీకి ఉచిత విద్యుత్ అందించాలన్నారు. కార్యక్రమ నిర్వాహకులు శ్రీరామాంజులు, అధ్యాపకులు డాక్టర్ భాస్కర్, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ రెడ్డి నాయక్, డాక్టర్ గోపి, ఉమామహేశ్వరి, డాక్టర్ గిరీష్ కుమార్, డాక్టర్ అరుణ కుమారి, లాల్ బాషా పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అక్టోబర్ 11వ తేదీ అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వివిధ పోటీలను నిర్వహిస్తున్నట్లు పిసిపిఎన్‌డిటి జిల్లా నోడల్ అధికారి డాక్టర్ హనుమంతరావు తెలిపారు. గురువారం పిసిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి పోటీలను ఆయన ప్రారంభించారు. సేవ్‌గర్ల్ చైల్డ్ అనే అంశం పైన మండల స్థాయిలో గెలుపొందిన పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, డిబేట్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.5వేలు, రెండవ బహుమతి రూ.3వేలు, మూడవ బహుమతి 2వేలు అందజేస్తామన్నారు. డెమో జయరాముడు,వరదప్ప నాయుడు, హెచ్‌ఎం లక్ష్మి, పిసిఆర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పూర్వాని, హెల్త్ ఎడ్యుకేటర్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు హెబ్సిబా, భువనేశ్వరి, హసీనా పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన వైశాలి

చిత్తూరు డెస్క్: చిత్తూరు జిల్లా కేంద్రం పిసిఆర్‌లో నిర్వహించిన బాలికల సంరక్షణ అనే అంశంపై చిత్రలేఖన పోటిలలో పిఎంశ్రీ జెడ్ పి హైస్కూల్ ప్లస్ విద్యార్థిని వైశాలి ప్రథమ బహుమతిగా రూ.5వేలు పొందినట్లు ప్రధానోపాధ్యాయులు గిరిరాజ తెలిపారు. ఆర్ట్ మాస్టర్ దామోదరచారి ఈ విద్యార్థినికి తర్ఫీదు ఇచ్చి జిల్లాస్థాయిలో విజేతగా నిలిపారన ఉపాధ్యాయులు, అధికారులు ప్రశంసించారు. ఉపాధ్యాయులు వెంకటరమణ, కృష్ణారెడ్డి, త్రివేణి, సునీల, కవిత, సరస్వతి, సుగుణ, జగన్నాథ రెడ్డి, విజయ కుమార్, ఢిల్లిబాయి, మల్లికార్జున, లీలా కుమారి, మీన, షహనాజ్ ఖానమ్, కల్పన, కల్పలత పాల్గొన్నారు.

వయోవృద్ధులకు కంటి అద్దాలు పంపిణీ

కళ్ల అద్దాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పురపాలక సంఘం కార్యాలయలంలో పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము ఆధ్వర్యంలో వయోవృద్ధులకు కంటి అద్దాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సోము, సురేష్, నాయకులు జాకీర్ అహ్మద్, భాగ్యలక్ష్మి త్రిలోక్, అరుణాచలం, తిరుమగల్ పాల్గొని వయోవృద్ధులకు అద్దాలు అందించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందత్వ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కంటి వైద్యశిరాలను ఏర్పాటు చేసి, అర్హులందరికీ కళ్ళజోళ్లలు ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే థామస్


కార్వేటినగరంలో..


చిత్తూరులో..

ప్రజాశక్తి- కార్వేటినగరం: గ్రామాల అభివృద్ధే ముఖ్యలక్ష్యం ధ్యేయంగా పనిచేయాలని జిడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం. థామస్ అన్నారు. గురువారం ఆర్‌కెవిబిపేట ఉన్నతపాఠశాల ఆవరణలో టిడిపి మండల అధ్యక్షులు చెంగల్రాయలు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో 12 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నాగేశ్వరరాజు, రాష్ట్ర రైతు కార్యదర్శి జనార్ధన్ రాజు, జనసేన జీడి నెల్లూరు ఇంచార్జ్ పొన్న యుగంధర్, పార్టీ అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్, కార్యదర్శి రాజేంద్రరెడ్డి, సర్పంచ్ దివ్య, బీసీ సంఘం అధ్యక్షులు రవి యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ రవికుమార్, ఇంచార్జ్ ఎంపీడివో లక్ష్మిపతి, తహసీల్దార్ భగవతి, ఎంఈఓ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలం ఆళ్లమడుగులో తెలుగు యువత జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షులు బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి స్టిక్కర్లను అంటించారు.

సదుం: ప్రజలు మంచి మనస్సుతో కూటమి ప్రభుత్వానికి అవకాశమిచ్చారని, ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెరవేరుస్తారని టిడిపి పుంగనూరు నియోజకవర్గం ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన ఘనస్వాగతం పలికారు. మండల తహశీల్దార్ మారూఫ్ బాష, ఎంపిడిఓ రాజశేఖర్ బాబు, టిడిపి మండల కన్వీనర్ రెడ్డిప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, అమరన్నాథ్ గౌడ, మహేశ్వర్ రెడ్డి, వెంకట రమణా రెడ్డి, బోడికూరి నారాయణ, గౌతమ్ రెడ్డి, జనసేన నాయకులు ఆనంద్, నాగ చైతన్య, సాయి సుమంత్, దొరబాబు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: చిత్తూరు రూరల్ మండలం స్థానిక చెన్నసముద్రం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ 100 రోజుల పాలన ముగించుకొని ధైర్యంగా ప్రజల్లోకి వెళ్ళగలుగుతున్నామని, ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరించగలుగుతున్నామని తెలిపారు. ప్రజలు కూడా టిడిపి ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అనంతరం స్వర్ణ ఆంధ్ర 2047 గోడ పత్రికలను విడుదల చేశారు. టిడిపి మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నాయకులు చంద్రప్రకాష్, జయచంద్ర నాయుడు, శశికర్ బాబు, ఎన్.రఘు పాల్గొన్నారు.

కుప్పం రూరల్: కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాంబ శివం, రామచంద్ర, రాజగోపాల్, చెక్కునత్తం మణి, కనకరాజు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటిటికి వెళ్లి కరపత్రాలు పంచి స్టికర్లు అంట్టించారు. టిడిపి నాయకులు భాను ప్రతాప్‌రెడ్డి, రాజుపల్లె గ్రామ నాయకులు బాలకృష్ణ రెడ్డి, నాగరాజు యాదవ్, ప్రవీణ్ కుమార్, కిరణ్, గణేష్, జైపాల్ రెడ్డి, చందు పాల్గొన్నారు.

పలమనేరు: పట్టణంలోని రాజీవ్ గాంధీనగర్, టిఎస్ అగ్రహారంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి. రమణారెడ్డి తెలిపారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం పురపాలక సంఘం ఆవరణలోని బాపూజీ ఉద్యావనంలో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపిడిఓ, మండల అధికారులు పాల్గొన్నారు.

బురదమయమైన రోడ్డు

ప్రజాశక్తి- విజయపురం (నింద్ర): నింద్ర మండలం మిట్టకండ్రిగ గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు, మురుగు నీరు రోడ్డుపై నిల్వచేరి గుంతలు ఏర్పడి, రోడ్డు బురదమయంగా మారింది. నిత్యం ప్రజలు నడిచి వెళ్లే మార్గంలో బురదతో నిండిన రోడ్డులో ఎలా నడిచేదని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అసలు అధికారులు ఉన్నారా...లేదా అంటూ ప్రశ్నిస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు బండి నడపడానికి కష్టపడుతున్నారు. హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, పెద్దలు, మహిళలు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైన అధికారులు రోడ్డును సరిచేయాలని కోరుతున్నారు.

సబ్సిడీ ఉలవలు పంపిణీ

రైతులకు ఉలవలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని పెరుమాలపల్లి రైతుసేవా భవనంలో రైతులకు సబ్సిడీ ధరకు ఉలవలు పంపిణీ చేశారు. గురువారం టిడిపి మండల అధ్యక్షుడు లోకనాథ్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు స్థానిక మాజీ యంపిటిసి మోహన్ మురళి అర్హులైన రైతులకు ఉలవలను అందించారు. రైతులు ప్రభుత్వం అందించే ఈ సబ్సిడీ ఉలవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గొడుగుచింత సర్పంచ్ బాబు, మాజీ సర్పంచ్ రాజారెడ్డి, పెరుమాళ్ళపల్లె ఆనంద్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, వెంకటద్రి నాయుడు, చెన్నకేశవరెడ్డి, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హీ సేవా' ర్యాలీ

ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- సోమల: మండలంలోని నంజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం గురువారం గ్రామంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్లాస్టిక్‌ను విడనాడాలని విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు కుసుమాంబ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఈటీకి ఘన సన్మానం



ప్రజాశక్తి- కార్వేటినగరం: డీఎం.పురం ఉన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న తిరుమలరాజుని గురువారం పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. గత ఎనిమిదేళ్లుగా పాఠశాల అభివృద్ధికి విద్యార్థులను ప్రోత్సహించడంలో విశేష సేవలందిస్తున్నారని కమిటీ చైర్మన్ త్యాగరాజు తెలిపారు. జోనల్ స్థాయి ఆటలపోటీల్లో విద్యార్థులు ప్రతిభను ప్రోత్సహించి పాఠశాలకు అందిస్తున్న సేవలను హెచ్‌ఎం కేశవులు కొనియాడారు. శుక్రవారం శుభదిన్ భోజనంలో పీఈటీ తిరుమల రాజు జన్మదినం సందర్భంగా వడ, పాయసం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు త్యాగరాజు, చిరంజీవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అక్రమార్కులు చెరువులను యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారని, వాగులను వంకలను సైతం వదిలిపెట్టడం లేదని కుప్పం పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్తలు కన్నన్, శివశంకర్, గణేష్ ధ్వజమెత్తారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డులోని వెంకట్రామయ్య చెరువు దురాక్రమణకు గురైనా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని, ఈక్రమంలో డివిజనల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఆదేశాలు సైతం ఆచరణకు నోచుకోవడం లేదని ఆరోపించారు. చెరువులు, భూముల కబ్జాలపై పలు మార్లు ప్రతికల్లో కథనాలు ప్రచురితమైనా అధికారుల్లో మాత్రం ఎటువంటి చలనం లేదని విమర్శించారు. ఇకనైనా కలెక్టర్ స్పందించి దురాక్రమణల నుండి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. అలాగే ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన శిక్షణా కేంద్రాన్ని కుప్పంలో ప్రారంభించాలని విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సంతోష్ కుమార్, సభ్యులు సత్యరాజ్ కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ శిక్షణ కేంద్రాన్ని కుప్పంలో స్థాపించడానికి సంబంధించిన అంశాలను పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సామాజిక కార్యకర్తలు

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం నంజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయినట్టు ప్రధానోపాధ్యాయురాలు కుసుమాంబ తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలలో విద్యార్థులు నిఖిత, దీక్షిత, మంజునాథ, కార్తీక్ ప్రతిభ కనపరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన పాఠశాల విద్యార్థులను అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు.

విజయపురం (నింద్ర): ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లా స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో అరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9 వ తరగతి చదువుచున్న పి.యామిని 200 మీటర్, 400 మీటర్ పరుగు పందేంలో గెలుపొంది. అక్టోబర్ 9,10 తేదీలో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు గిరిజవతి, ఫీజికల్ డైరెక్టర్ జ్ఞానకుమార్ తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ సైన్ లాంగ్వేజ్ దినోత్సవం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అంతర్జాతీయ సైన్ ల్యాగ్వేజ్ దినోత్సవం స్థానిక అంబేద్కర్ భవన్‌లో జిల్లా డెన్ అసోషియేషన్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులశాఖ ఏడి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ ప్రతినిధి శ్రీధర్, విభిన్న ప్రతిభావంతుల సంఘం నాయకులు మురళి ముఖ్యఅతిధిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా బధిరులు ఎదుర్కొంటున్న సమస్యలను ఏడి దృష్టికి తీసుకొచ్చారు. డెన్ అసోషియేషన్ సభ్యులు, విభిన్న ప్రతిభావంతుల సంఘం నాయకులు మురళి, బదిరుల సంఘం నాయకులు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ బధిరులకు ప్రభుత్వం అందిస్తున్న సాయం ఏపాటికి సరిపోవడం లేదన్నారు. అనేక సమస్యలతో బధిరులు ఎదుర్కొంటున్నారని జిల్లా కేంద్రంలో బధిరుల కోసం ప్రత్యేక రూం కేటాయింపు, ఇంటి స్థలాలు, రేషన్ కార్డులు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, ఎన్‌హెచ్ ఎఫ్‌డిసి రుణాల మంజురులో సవరణలు చేసి బధిరులందరూ రుణాలు పొందే అవకాశం కల్పించాలని, అర్హత కలిగి పెక్షన్ కొల్పొయిన వారికి పెక్షన్, మహిళా బధిరులకు టైలరింగ్ ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు కుట్టుమిషన్ పంపిణీ, కాంట్రాక్టు ఉద్యోగాల్లో అవకాశం, వాలంటీరీ ఉద్యోగాల్లో అవకాశం, ఉచిత లాప్‌ట్యాపులు, టచ్‌ఫోన్లు పంపిణీ చేయాలని కోరారు. లయన్స్ క్లబ్ బధిరుల పట్ల ఎంతో దాతృత్వంలో కుట్టుమిషన్లు, ట్రైసెకిల్స్, ప్రత్యేక రూమును కేటాయించనున్నట్లు సమావేశంలో క్లబ్ ప్రతినిధులు ప్రకటించారు.

సమస్యలపై మాట్లాడుతూ బధిరుల సంఘం నాయకులు

తూనికల యంత్రాలకు ప్రభుత్వ సీల్ తప్పనిసరి

ప్రజాశక్తి- సోమల: సోమల మండలంలోని 37 చౌక దుకాణాలకు సంబంధించి 29 చౌక దుకాణ నిర్వాహకులు తమ వేయింగ్ మిషన్లకు ప్రభుత్వ సీలు (ముద్ర) వేయించుకున్నట్లు పలమనేరు తూనికలు కొలతలు శాఖ అధికారిని రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపారస్తులు చిల్లర దుకాణ యజమానులు చౌక దుకాణ నిర్వాహకులు ప్రతి ఒక్కరూ ప్రభుత్వం సూచించిన నిబంధన మేరకు తప్పకుండా తమ తూనికల యంత్రాలకు ప్రభుత్వ సీలు (ముద్ర) వేయించుకోవాలన్నారు. అలా వేయించుకున్న తర్వాత వాటిని తొలగించి వినియోగదారులను మోసం చేయడం తూనికలు కొలతలలో తేడాలు చేసినట్లు తమ దృష్టికి వస్తే కచ్చితంగా కఠినచర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో తూనికలు కొలతల శాఖ సిబ్బంది చౌక దుకాణ డీలర్లు పాల్గొన్నారు.

వేయింగ్ మిషన్లను పరిశీలిస్తున్న అధికారి రమాదేవి

ఎన్‌సిసి సేవలు అభినందనీయం : సిఐ

ప్రజాశక్తి- కుప్పం టౌన్

ఎన్‌సిసి సేవలు అభినందనీయమని ద్రావిడ విశ్వవిద్యాలయ ఎన్‌సిసి బృందాన్ని కుప్పం రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ అభినందించారు. గుడివంకలోని సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో ఆడికృతిక సందర్భంగా ద్రావిడ విశ్వవిద్యాలయం ఎన్‌సిసి బృందం సేవలను అందించినట్లు తెలిపారు. వారి సేవలను అభినందిస్తూ గురువారం ఎన్‌సిసి విద్యార్థులను అభినందించారు.

క్రైం న్యూస్

రెండు జెసీబీలు, ఒక ట్రాక్టర్ సీజ్

స్వాధీనం చేసుకున్న జెసిబిలు, ట్రాక్టర్

ప్రజాశక్తి- పూతలపట్టు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు జేసీబీలు, ఒక ట్రాక్టర్‌ను పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం మండల పరిధిలోని కొర్లమిట్ట గ్రామసమీపంలోని భీమానదిలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి వాహనాలను సీజ్ చేశారు. సంబంధిత వాహనదారులను గుర్తించే ప్రయత్నంలో పోలీసులున్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

అనారోగ్య సమస్యతో మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి- బంగారుపాళ్యం

ఆరోగ్య సమస్యలతో మహిళ మృతి చెందిన సంఘటన బంగారుపాల్యం మండలం చంద్రశేఖరపురం గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకున్నది. ఏఎస్ఐ రామచంద్రారెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు చంద్రశేఖరపురం గ్రామానికి చెందిన ఉదయ్ కుమార్ భార్య ఎన్.సరిత (38) గత రెండు నెలలుగా ఆరోగ్యం సరిగాలేక బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం విషం తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెని తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో- వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- సోమల: ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన సోమల సచివాలయం 2 దిడ్డివారిపల్లి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మన్సూర్ బాష (29) బుధవారం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో అడుసుపల్లి సమీపంలో ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొనడంతో కుడికాలు ఎముక విరిగి తీవ్రగాయపడ్డారు. ప్రస్తుతం తిరుపతిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు సహచర ఉద్యోగులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి- సోమల: మండలం చింపిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ నాయుడు (59) గురువారం ఇంటి వద్ద గుండెపోటు రావడంతో సమీపంలోని పెద్ద ఉప్పరపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయనకు భార్య పద్మావతి, జయదీప్, వైదీప్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండు రోజులుగా అనారోగ్యంతో(జ్వరం) బాధపడుతూ విధులకు సెలవు పెట్టారు. ఇంతలోనే గుండెపోటు రావడంతో మృతి చెందారు. ఈయన మృతికి మండలంలోని యూటీఎఫ్, ఎస్‌టియు సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు తమ సంతాపాన్ని తెలియజేశారు.

గ్రానైట్ లారీ సీజ్

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం

ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న లారీని ఎస్ఐ సీజ్ చేశారు. ఎస్ఐ సుమన్ విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని కటికపల్లి పంచాయతీ పిల్లి గుండ్లపల్లి గ్రామం, మంగుంట సమీపంలో నుంచి గ్రానైట్‌ను అక్రమంగా చిత్తూరుకు తరలిస్తున్న లారీని ఎస్ఆర్ పురం ఎస్సై సుమన్ గురువారం ఉదయం కొత్తపల్లి మిట్టలో పట్టుకున్నారు. సరైన అనుమతులు లేకపోవడంతో డ్రైవర్ షణ్ముగంను అదుపులోకి తీసుకొని లారీ సీజ్ చేసినట్లు తెలిపారు.

టపాకాయలు స్వాధీనం- కేసు నమోదు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం తమ్మినాయునిపల్లి పంచాయతీ కోట గుండ్లపల్లి గ్రామంలోని టి.వెంకట రమణ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.1,33,388లు విలువ గల టపాకాయలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై శివశంకర్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి టపాకాయలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

స్వాధీనం చేసుకున్న టపాకాయలతో ఎస్సై

పాఠశాలలో ఎంఈవో తనిఖీలు

ర్యాలీని ప్రారంభించిన ఎంఈవో దేవరాజ్

ప్రజాశక్తి -సదుం: సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను చిత్తూరు జిల్లా విద్యాధికారి సి.దేవరాజ్ గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలలో మంచి ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు తీసుకుంటున్న చర్యలపై ఆయన ఆరా తీశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు జయకుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో డీఈఓ మొక్కను నాటించారు. అనంతరం కాలుష్య రహిత వాహనాలు విద్యార్థులచే సైకిల్ ర్యాలీని బస్టాండ్ కూడలిలో డీఈవో దేవరాజు ప్రారంభించారు.